బ్రహ్మోత్సవాలలో నేడు
ఉదయం: 7 గంటలకు **మహారథోత్సవం**
రాత్రి: 7-9మధ్య **అశ్వవాహనం**




అలంకారప్రియుడు.. పూలరంగడు.. తిరుమలేశుడు. సకల జగత్తుకూ జీవదాతలైన సూర్య చంద్రులనే తన వాహనాలుగా మలచుకున్న మాయగాడు. మంగళవారం ఉదయం సూర్యప్రభమీద ఊరేగిన స్వామి, రాత్రి చంద్రప్రభపై విహరించాడు. మెడలో నూరువరహాల ఎర్రెర్రని పూదండతో పగలు సోయగాలు చిందించిన శ్రీనివాసుడు, రాత్రి మల్లెపూమాల ధరించాడు.

సూర్య చంద్రులే వాహనాలుగా...

నూరువరహాల సోయగం

బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే వాహన సేవల్లో సూర్యప్రభవాహనం ఒకటి. అత్యంత బరువుతో కూడిన ఈ వాహనంపై కొలువుదీర్చే మలయప్పస్వామికి విశేష పుష్పాలంకరణ చేస్తారు. సూర్యుడికి ప్రతీకగా ఎర్రటి నూరువరహాల పూలను వినియోగిస్తారు. 40 కిలోలపూలతో అల్లిన మాలను మలయప్పస్వామికి అలంకరించారు. కిలో రూ.10 వేల ధర కలిగిన కురువేరును నూరువరహాల పూలమాల కిందనే వినియోగించారు. సంపంగి, కనకంబరం పూల మాలలను కూడా స్వామికి అలంకరించడంతో సూర్యప్రభ వాహనంపై మలయప్పస్వామి ప్రత్యేక అందాలతో భక్తుల హృదయాలను దోచుకున్నారు.


మల్లెపూల పరిమళం

రాత్రి చంద్రప్రభ వాహనంపై 60 కిలోల మల్లెపూల మాల ధరించిన మలయప్ప మాడవీధుల్లో భక్తులకు కనువిందు చేశాడు. వెన్నెరేడు చందురుడు. ఆయనకు ప్రతీకగా తెల్లని పూలను రాత్రి అలంకరణలో వాడారు. మల్లె పూలకు ఇది కాలం కాకపోయినా టీటీడీ ఉద్యానవన విభాగం మూడు బృందాల ద్వారా వీటిని సేకరించింది. పుత్తూరు పరిసర ప్రాంతాలు, మధురై వంటి ప్రాంతాల నుంచి కిలో దాదాపు రూ.800 పెట్టి వీటిని తీసుకువచ్చారు. అల్లిన మల్లె మాలలో స్వామి అందం ఇనుమడించింది. ఈ వాహనసేవలోనూ ఐదు కిలోల కురువేరును వినియోగించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



వాహన సేవల్లో ప్రదర్శనలు ఇవ్వడానికి 28 రాష్ట్రాల నుంచి 6,960 మంది కళాకారులు వచ్చారు. మంగళవారం రాత్రి చంద్రప్రభ వాహన సేవ వరకు దాదాపు 6,400 మంది కళాకారులు తమ అద్భుత విన్యాసాలతో భక్తులను అలరించారు.



24వ తేది రాత్రి పెద్ద శేషుడితో స్వామివారి వాహన సేవలు మొదలయ్యాయి. బుధవారం రాత్రి జరగనున్న అశ్వ వాహనంతో ముగియనున్నాయి.

ఏపీ కనీస వేతనాల సలహా మండలి సభ్యుడిగా జయరామిరెడ్డి



కేవీబీపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం టీడీపీ నేత కరణి జయరామిరెడ్డిని ఏపీ కనీస వేతనాల సలహామండలి సభ్యుడిగా ఎంపిక చేశారు. ఈ మేరకు మంగళవారం టీడీపీ అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సీఎం చంద్రబాబునాయుడు తనపై నమ్మకంతో పదవి అప్పజెప్పినందుకు రుణపడి ఉంటానని జయరామిరెడ్డి తెలిపారు.

బెస్త కార్పొరేషన్ డైరెక్టర్లుగా పళణి, శ్రీధర్



బొమ్మన పళణి - కోడిపర్తి శ్రీధర్

తడ/గూడూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బెస్త సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌కు 15 మంది డైరెక్టర్లను నియమించారు. వీరిలో జిల్లాకు సంబంధించి తడ మండలానికి చెందిన బొమ్మన పళణి, గూడూరుకు చెందిన కోడిపర్తి శ్రీధర్ ఉన్నారు. బెస్త కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బొమ్మన శ్రీధర్‌కు బొమ్మన పళణి స్వయాన చిన్నాన్న. బెస్త కార్పొరేషన్‌లో తడ మండలానికి చెందిన ఇద్దరికి పదవులు దక్కడంతో మత్స్యకారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పళణిని పులికాట్ మత్స్యకార సంక్షేమ సంఘం నాయకులు అభినందించారు. మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేస్తానని శ్రీధర్ చెప్పారు.

స్విమ్స్ ఓపీ, ఓటీలకు రేపు సెలవు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు, 30(ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా గురువారం స్విమ్స్‌లో ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం అత్యవసర సేవలు మాత్రమే యధావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు. రోగులు, ప్రజలు సహకరించాలని కోరారు.

జీవిత ఖైదీకి బంగారు పతకం

ఏర్పేడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైల్లో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న జి.యుగంధర్ మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ నుంచి బంగారు పతకం అందుకున్నాడు. ఏర్పేడు మండలం జంగాలపల్లెకు చెందిన ఇతడికి.. ఒక హత్య కేసులో 2011 జూలై 18న జీవితఖైదు పడింది. కడప కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ కారాగారంలోకి వచ్చినప్పటి నుంచి ఓల్డ్‌పాటర్న్‌లో రెండు బీఏలు, న్యూపాటర్న్‌లో చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టంలో రెండు బీఏలు, మూడు ఎంఏలు పూర్తి చేశాడు. కంప్యూటర్ ట్రైనింగ్, కార్పెంటరీ ట్రైనింగ్ స్కిల్ సర్టిఫికెట్లు పొందాడు. ప్రస్తుతం పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ సబ్జెక్టులుగా బీఏ పూర్తి చేశాడు. ఇందులో 8.02 జీపీఏ సాధించి బంగారు పతకానికి ఎంపికయ్యాడు. మంగళవారం హైదరాబాదులో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ 26వ స్నాతకోత్సవంలో యుగంధర్‌కు డిగ్రీ పట్టాతో బంగారు పతకాన్ని అందించారు. కడప జైల్లో జీవితఖైదు అనుభవిస్తున్న యుగంధర్ ఓపెన్ డిగ్రీలో అత్యుత్తమ ప్రతిభ చూపించి బంగారు పతకం సాధించడం సంతోషంగా ఉందని జైలు పర్యవేక్షణాధికారి రాజేశ్వర్‌రావు, ఉప పర్యవేక్షణాధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు.



బంగారు పతకం అందుకుంటున్న యుగంధర్



నేడు మహారథం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గరుడ వాహనసేవ తర్వాత అంతటి ప్రాముఖ్యత ఉన్నది మహారథోత్సవం (చెక్కతేరు). బుధవారం ఉదయం 7 గంటలకు మహారథం కదులుతుంది. 600 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన ఈమహారథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామిని వేంచేపు చేయనున్నారు. భారీ బరువు, ఎత్తుతో కలిగిన మహారథాన్ని మాడవీధుల్లో తిప్పడం కష్టమైన కార్యక్రమం. అందుకని మూడు నెలల ముందు నుంచే దీనికి కసరత్తు మొదలవుతుంది. ఇప్పటికే రథానికి బ్రేకులు, చక్రాలకు గ్రీసు వేశారు. మహారథంలోకి ఎక్కాల్సింది ఎవరు? చక్రాల కదలికల పరిశీలన.. చెక్కలను పెట్టడం.. చక్రాల సమీపానికి భక్తులు రాకుండా చూసే బాధ్యతలనూ కొందరికి అప్పగించారు. రథాన్ని లాగడంలో టీటీడీ సిబ్బందితో పాటు భక్తులను భాగస్వాములు చేయనున్నారు.

బంగారు గొడుగు ఉత్సవం



మంగళవారం సాయంత్రం తిరుమలలో బంగారు గొడుగు ఉత్సవం నిర్వహించారు. పంతులుగారి రామనాథన్ ఆధ్వర్యంలో క్షురకులు, సిబ్బంది, సభ్యులు కల్యాణకట్టలో గొడుగుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు శాంతారామ్, రాష్ట్ర నాయి బ్రహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, కల్యాణకట్ట డిప్యూటీ ఈవో వెంకటయ్య, ఏఈవో అమర్నాథ్, సూపరింటెండెంట్లు రమాకాంత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహారథంపై దీనిని అలంకరించారు. తొలిరోజుల్లో కొయ్య గొడుగుతో ప్రారంభమై 1952 నుంచి రథానికి బంగారు గొడుగు సమర్పించడం జరుగుతోంది. పంతులుగారి ప్రస్తుత వంశీకుడైన రామనాథన్ సంప్రదాయంగా గొడుగును అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

దూకేస్తున్నా...!

- విద్యుత్ టవరెక్కిన కర్ణాటక యువకుడు
- రక్షించేందుకు వలతో పోలీసుల విఫలయత్నం
- దూకే క్రమంలో కమ్మీలు తగిలి మృతి




విద్యుత్ టవర్ మీద వేలాడుతున్న శివ - తలకు బలమైన గాయమై అపస్మారకస్థితిలోనున్న యువకుడు

రేణిగుంట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దూకేస్తా.. ఆత్మహత్య చేసుకుంటా.. అంటూ విద్యుత్ టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన కర్ణాటక యువకుడి ఉదంతం విషాదంగా మారింది. రేణిగుంట మండలం గురవరాజపల్లిలో మంగళవారం ఈ ఘటన జరిగింది. కర్ణాటక రాష్ట్రం కడూరు ప్రాంతానికి చెందిన శివ(27) ఈనెల 27న శ్రీవారి దర్శనానికి బంధువులు, స్నేహితులతో కలిసి వచ్చారు. తిరుగు ప్రయాణంలో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకుంటానంటూ వచ్చేశారు. మంగళవారం ఉదయం గురవరాజపల్లి లోని 220 కేవీ విద్యుత్ టవరెక్కిన ఆయన ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ జయచంద్ర సిబ్బందితో అక్కడికి చేరుకుని విచారించారు. ఇంతలో అతడి సెల్‌ఫోను కింద పడింది. ఇందులోని నెంబర్ల ఆధారంగా కర్ణాటకకు చెందిన శివగా గుర్తించారు. అతడి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. ఒకవేళ శివ దూకితే రక్షించడానికి వలను సిద్ధం చేశారు. మరోవైపు పోలీసులు టవర్ ఎక్కేందుకు ప్రయత్నిస్తే వైరును పట్టుకుని వేలాడుతూ దూకేస్తాననే వాడు. చివరకు కిందకు దూకగా.. వలలో ఒడిసి పట్టుకునే సమయంలో టవర్ కమ్మీలు శివ తలకు తగలడంతో అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ మేరకు కేసు నమోదు చేశారు. ఇటీవల అల్లం పంటలో నష్టాలు రావడంతో అప్పులు పెరిగిపోయి మానసికంగా కుంగిపోయినట్లు శివ బావ గిరీష్ తెలిపారు. మద్యం తాగిన సమయంలో రెండుమూడు సార్లు ఆత్మహత్యకు యత్నించగా అడ్డుకోగా.. చివరకు తిరుపతిలో తమనుంచి తప్పించుకుని ఇక్కడ ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు.



దూకితే పట్టుకునేందుకు వలతో సిద్ధంగా ఉన్న పోలీసులు

ఆలయానికి వెండి నాగహారతి వితరణ



చంద్రగిరి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కొత్తపేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయానికి పాతపేటకు చెందిన గుణశేఖర్‌చెట్టి దంపతులు వెండి నాగ హారతిని వితరణ చేశారు. దేవీనవరాత్రి ఉత్సవాలు సందర్భంగా వీరు మంగళవారం 220 గ్రాముల బరువు గల వెండి నాగ హారతిని ఆలయ నిర్వాహకులు,అర్చకులకు అందజేశారు. ఆలయ నిర్వాహకుడు ఓంకార్ భరద్వాజ్, అర్చకులు గౌతమ్ శర్మ పాల్గొన్నారు.

విద్యార్థుల నృత్యం ముగ్ధమనోహరం



తిరుచానూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో దసరా సంబరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరుపతికి చెందిన సీటీసీ విద్యార్థులు ఆశ్రిత, భవిష, పామిని,సాయిప్రియ,పల్లవి,దేవిప్రియతదితరులు విరామ లాలి, గరుడ గమనం, తిరు థింక్ జరారా, శ్రీమన్నారాయణ, నాథరామ, వక్రతుండాయ వంటి కీర్తనలకు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. వీరిని శిల్పారామం ఫీల్డ్ సూపర్ వైజర్ సూర్యతేజ, ఏఈ రాధాకృష్ణ సత్కరించారు.

కోనేటిరాయుడి కరుణ వెలుగులు



సూర్యప్రభవాహనంపై శ్రీహరి

తిరుపతి రూరల్, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి):తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై ,రాత్రి చంద్రప్రభ వాహనంపై భక్తులను కటాక్షించారు. స్వామివారు తేజోమయుడుగా దర్శనమిచ్చారు.

సాఫీ రవాణాకు పోలీసులు పటిష్ట చర్యలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న వర్సిటీ సీఐ రామయ్య

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుపతిలో రవాణా ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా పోలీసు యంత్రాంగం గట్టి చర్యలు చేపట్టింది. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో యూనివర్శిటీ, తిరుపతి ఈస్ట్ సీఐలు రామయ్య, శ్రీనివాసులు, ఎస్‌ఐలు హేమాద్రి, రైల్వే పోలీసులు, ఎస్టీఎఫ్, ఏపీఎస్‌పి బలగాలు మంగళవారం రైల్వే స్టేషన్‌లో అడుగడుగునా తనిఖీలు చేశారు. ప్రతి ప్రయాణికుడినీ ఆరా తీశారు. కొందరి ఆధార్ కార్డులనూ పరిశీలించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా, తోపులాట జరగకుండా స్టేషన్ నుంచి బయటకు వచ్చే వారిని, లోపలకు వెళ్ళే వారిని అనుమతిస్తున్నారు. దీంతో రాక పోకలు సాఫీగా సాగుతున్నాయి. వాహనాల డ్రైవర్లు తిరుమలకు అధికంగా వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండులోనూ నాకాబందీ నిర్వహిస్తున్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి మృతి

- మద్యానికి బానిస కావడమే కారణం



మృతి చెందిన సాయికుమార్

తిరుపతి(నేర విభాగం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అలిపిరి ఎస్‌ఐ అజిత కథనం మేరకు.. చంద్రగిరి మండలం కొంగరవారిపల్లెకు చెందిన రూపకు అదే ప్రాంతానికి చెందిన సాయికుమార్ (29)తో తొమ్మిదేళ్ల కిందట వివాహమైంది. అతడు తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. భార్య హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో డేటా ఎంట్రీ ఆపరేటర్. ఈ క్రమంలో సాయికుమార్ తాగుడుకు బానిసయ్యాడు.తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఈక్రమంలో మంగళవారం కూడా గొడవ జరిగింది. దీంతో ఆమె పక్కన ఇంటికి వెళ్లింది. అదే సమయంలో సాయికుమార్ బయటకు వెళ్లి మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఇంటికి వచ్చి స్పృహ కోల్పోయాడు. భార్య గమనించి వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.శవాన్ని రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ముక్కంటి ఆలయంలో ఆయుధపూజ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీ కాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ఆయుధ పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన ముక్కంటీశుడి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు అశ్వయుజ శుద్ధ అష్టమి(దుర్గాష్టమి) సందర్భంగా మంగళవారం స్వామిఅమ్మవార్ల నిత్య కల్యా ణ మండపంలో వినాయకస్వామి, సుబ్రహ్మణ్య స్వామి, దక్షిణామూర్తి, శనీశ్వరస్వామి, స్వామి అమ్మవార్ల కవచాలకు, నిత్య దీపారాధన ని ర్వహించే దీపాలను మండపంలో ఉంచి పూజ లు నిర్వహించారు. ఆలయ అర్చకులు నైవేద్యం, హారతులు, మంత్రపుష్పం నిర్వహించారు.

విద్యార్థిపై హత్యాయత్నం కేసులో 11మంది అరెస్టు



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ సునీల్‌కుమార్

తిరుచానూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో 11మందిని అరెస్టు చేసినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాకు తెలిపిన వివరాలు ఇలా... తిరుచానూరు నేతాజీరోడ్డులో ఉంటున్న ఇంజినీరింగ్ రెండో సంవత్సర విద్యార్థి దినేష్‌కు కుహల్ అలియాస్ మురళీకృష్ణకు మధ్య ఓ అమ్మాయి ప్రేమ విషయంలో పలుసార్లు గొడవలు జరిగాయి. ఈక్రమంలో ఈ నెల 24న రాత్రి కుహల్, అతని స్నేహితులు కలిసి దినేష్‌ను కత్తులు, బీరు సీసాలతో పొడిచి పారిపోయారు. ఈ హత్యాయత్నం ఘటనలో నిందితులు కుహల్, దినసాగర్, అజిత్, సునీల్, మహేష్, తేజా సాయి. చాణుక్య, అనిల్, పూర్ణచంద్, వినయ్, విష్ణువర్ధన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్‌ఐ జగన్నాధ్‌రెడ్డి, పోలీసు సిబ్బందిని చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ అభినందించారు.

పీహెచ్‌డీ ప్రదానం



శ్రావణ్‌కుమార్

తిరుపతిరూరల్, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): కరకంబాడీరోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో గణితశాస్త్ర విభాగ అధ్యాపకుడు వి.శ్రావణ్‌కుమార్‌కి పీహెచ్‌డీ లభించింది. అన్నామలై వర్సిటీప్రొఫెసర్లు కె.యలన్గోవన్, సి.నాగేశ్వరనాథ మార్గదర్శకంలో ఘనపదార్థాల్లో తరంగాల ప్రసారం అనేఅంశంపై పరిశోధనావ్యాసం సమర్పించినందుకు తనకు పీహెచ్‌డీని ప్రదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈయన్ను కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అభినందించారు.

ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య



భాస్కర్‌బాబు మృతదేహం

తిరుచానూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో ఓ నెట్ సెంటర్ నిర్వాహకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ జగన్నాథరెడ్డి కథనం మేరకు ఇలా... చిన్నగొట్టిగల్లు మండలం చెరువు ముందరపల్లికిచెందిన వడ్డి భాస్కర్ బాబు(38) ఇడి అమ్మవారి ఆలయం సమీపాన ప్రశాంత్‌నగర్ క్రాస్‌లో భార్యతో కలిసి నెట్‌సెంటర్ నిర్వహించేవాడు. అదే అద్దె భవనం మొదటి అంతస్తులో నివాసం కూడా ఉండేవాడు. మంగళవారం ఉదయం యథావిధిగా భాస్కర్‌బాబు భార్య నెట్ సెంటర్‌కు వెళ్లిపోయింది. కాస్సేపటి తరువాత పైకి వచ్చి చూడగా భర్త ఇంట్లో సీలింగ్‌ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు చేరుకుని భాస్కర్‌బాబును ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోలీసులు రుయాకుతరలించారు. ఆర్థిక సమస్యలతో భాస్కర్‌బాబు మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు శ్రీగంధం స్మగ్లర్ల అరెస్టు



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి కపిలతీర్థం వద్ద గల నగరవనంలో మంగళవారం అటవీశాఖ అధికారులు ఇద్దరు శ్రీగంధం స్మగ్లర్లను అరెస్టు చేశారు. మూడు శ్రీగంధం ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రేంజర్ సుదర్శన్‌రెడ్డికి అందిన రహస్య సమాచారం మేరకు టీఎస్‌పాళెం సెక్షన్ అటవీ శాఖ అధికారులు నగరవనంలో తనిఖీలు చేపట్టారు.

ఇద్దరు వ్యక్తులు శ్రీగంధం చెట్లను నరుకుతూ కనిపించడంతో పట్టుకున్నారు. వారి నుంచి 11.40 కేజీల బరువు ఉన్న మూడు శ్రీగంధం మొక్కలను, ఓ మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చిత్తూరుకు చెందిన వారిగా గుర్తించారు. వాహనం సహా పట్టుబడిన శ్రీగంధం విలువ రూ.3లక్షలు ఉంటుందని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఎఫ్ఎస్‌వో చైతన్య, ఎఫ్‌బీవోలు కిషోర్, శివకుమార్, వాచర్లు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గాజులపెళ్లూరు గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారాన్ని పురస్కరించుకుని పాలాభిషేకం చేసి పూలతో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గ్రామస్తులు ఎదురు పొంగళ్ళు పెట్టి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నత్తనడకన రహదారి విస్తరణ పనులు

- తవ్వేసిన గుంతలతో ఇబ్బందులు
- చెర్లోపల్లె -శ్రీనివాసమంగాపురం మార్గంలో అవస్థలు





చెర్లోపల్లె సర్కిల్- శ్రీనివాసమంగాపురం రహదారిలో విస్తరణ పనుల్లో భాగంగా తవ్వేసి వదిలేసిన పనులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు30(ఆంధ్ర జ్యోతి): చెర్లోపల్లె సర్కిల్ నుంచి శ్రీనివాస మంగాపురం వరకు డబుల్ లేన్ విస్తరణ పనులు రెండేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో రెండేళ్ల క్రితం పనులు ప్రారంభమైనా అడుగు ముందుకు పడలేదు. అటవీశాఖ అనుమతి,ఎలక్ట్రికల్ లైన్ల సమస్యతో కొంతకాలం పనులను నిలిపివేశారు. కూటమిప్రభుత్వమొచ్చాక కొంత పురోగతి కనిపించింది. చెట్లు, విద్యుత్ స్తంభాల తొలగింపునకు అనుమతి లభించింది. ఆరునెలల కిందట కొంత కదలిక వచ్చినా టీటీడీ, విద్యుత్, అటవీశాఖల అధికారుల మధ్య సమన్వయలోపం వల్ల ఆశించిన స్థాయిలో విస్తరణ పనులు జరగడంలేదు. చెర్లోపల్లె సర్కిల్ నుంచి అరుణమ్మకాలనీ వెళ్లే మార్గంలో. ఇప్పటికీ పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు అడ్డుగానే ఉన్నాయి. రహదారికి అటు..ఇటు కొంతదూరం తవ్వేసి వదిలేశారు. మరికొంతదూరంలో పనులే ప్రారంభించలేదు. పీలేరు మార్గంలో అనేక గ్రామాలు, పలు విద్యాసంస్థలు ఉన్నాయి. శ్రీనివాసమంగాపురంలో కల్యాణ వెంకన్న ఆలయముంది. దీంతో రాకపోకలు ఎక్కువే. . తవ్వేసిన గుంతల వల్ల రోడ్డులో వాహనాలు ఎదురైనప్పుడు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి పూట మరింత కష్టంగా ఉంటోంది.



చిత్రం: కేశవ్

పరమయోగి వెంగమాంబ

తిరుమల శ్రీనివాసుడిని తన సాహిత్యం ద్వారా అర్చించిన మహాకవయిత్రి తరిగొండ వెంగమాంబ. 1730లో తరిగొండలో పుట్టిన ఈమె తిరుమలనే ఆ తర్వాత తన నివాసంగా మార్చుకున్నది. తిరుమల ఆలయానికి 15 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవిలో తుంబురకోన వద్ద వెంగమాంబ యోగాభ్యాసం చేసేదంటారు. వెంగమాంబ రచించిన 'వేంకటాచల మహత్యం' అద్భుత పద్య కావ్యం. యోగ రహస్యాలు వివరించే 'అష్టాంగ యోగసారం' అనే గ్రంథం కూడా పద్యరూపంలో రాశారు. రమాపరిణయం, రాజయోగామృత సారం, ద్విపద భాగవతం, వాశిష్ఠ రామాయణం అనే ద్విపద కావ్యాలు కూడా వెంగమాంబ రాశారుఏ. రెండు శతకాలు, తత్వ కీర్తనలు రాసిన వెంగమాంబ యక్షగానాలు గొప్ప సాహిత్య విలువలు గలవిగా భావిస్తారు. అలంకార, వ్యాకరణాలు ఏవీ తెలియకనే వెంగమాంబ చిన్న వయసు నుంచే రచనలు చేయడం విశేషం. వెంకటాచలమహత్యము లో పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణాన్ని వివరించిన తీరు అద్భుతం. స్త్రీలోని సున్నిత భావాలను, ఆత్మాభిమానాన్ని ఇందులో చిత్రించారు. 90 ఏళ్లు జీవించిన వెంగమాంబ 1817లో తిరుమలలోని వరాహస్వామి అతిథిగృహం వెనక భాగంలో యోగసమాధి అయ్యారు. ఉత్తర మాడవీధిలో ఆమె నివాసం ఉండేది. వెంగమాంబ గుర్తుగా ఏకాంత సేవ తర్వాత ఆలయంలో తరిగొండ ముత్యాల హారతిని స్వామి రోజూ అందుకుంటారు. ఇదొక ఆచారంగా స్థిరపడిపోయింది. వెంగమాంబ పుట్టిన తరిగొండలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ వెంగమాంబ విగ్రహం ఉంది.



శ్రీవారి ఆలయ ఇన్‌చార్జి డిప్యూటీఈవోగా హరీంద్రనాథ్

తిరుమల, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ ఇన్‌చార్జి డిప్యూటీఈవోగా హరీంద్రనాథ్ నియమితులయ్యారు. ప్రస్తుత డిప్యూటీఈవో లోకనాథం కుటుంబ సభ్యుల్లో ఒకరు మృతి చెందిన నేపథ్యంలో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ డిప్యూటీఈవోగా ఉన్న హరీంద్రనాథ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. అక్టోబరు 8వ తేదీ వరకు ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు.

పూలమండపంలో స్నపనం

తిరుమల, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): మంగళవారం ఉదయం శ్రీవారి ఆలయంలో ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా సాగింది. రంగనాయక మండపంలో పవిత్రాలు, లవంగాలు, వట్టివేరు, తులసి, డ్రైఫ్రూట్లు, రోజా, తులసితో సహా తొమ్మిది సెట్ల మాలలు, కిరీటాలను తయారు చేసి స్నపన తిరుమంజనంలో స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. వివిధ రంగుల పుష్పాలు, ఫలాలు, సాంబ్రాణి, ధూపదీప నైవేద్యాల నడుమ రంగనాయక మండపం కళకళలాడింది. తొలిసారిగా బ్లూ పవిత్రాలతో తయారు చేసిన మాలలు, కిరీటాలను ఉత్సవమూర్తులకు అలంకరించారు. దాదాపు రెండు నెలల పాటు తయారు చేసి సమర్పించిన ఈ మాలలు, కిరీటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇక, 10 వేల కట్ రోజాలు, ఆర్కిట్స్ పుష్పాలతో తీర్చిదిద్దిన రంగనాయక మండపం అద్భుతంగా దర్శనమిచ్చింది.



శ్రీవారి భక్తులకు పుస్తక ప్రసాదం అందించేందుకు ప్యాకెట్ సైజులోని పది పుస్తకాలను టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు మంగళవారం రాత్రి చంద్రప్రభ వాహనం ముందు ఆవిష్కరించారు. వేంకటేశ్వర సుప్రభాతం, శ్రీనివాసుని దివ్యకథ, భజగోవిందం, శంకరాచార్య కృత స్తోత్రములు, విష్ణు సహస్రనామ స్తోత్రం, లలిత సహస్రనామ స్తోత్రం, శ్రీమద్ భగవద్గీత, రథసప్తమి, మహాశివ రాత్రి, కార్తీక వైభవం తదితర పుస్తకాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. బోర్డు సభ్యులు, హెచ్‌డీపీపీ కార్యదర్శి శ్రీరాం రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

-తిరుమల(కల్చరల్),ఆంధ్రజ్యోతి

గరుడవాహన సేవలో శ్రీవారి సేవకుల పాత్ర అమోఘం

తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : గరుడ సేవ రోజున 20 గంటల పాటూ శ్రీవారి సేవకులు అవిశ్రాంతంగా భక్తులకు సేవలు అందించినట్లు టీటీడీ చీఫ్ పీఆర్వో డాక్టర్ రవి తెలిపారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు వీరి సేవలు కొనసాగాయని, రిటైరైన పెద్ద అధికారులు ఎందరో సేవలో పాల్గొన్నారని చెప్పారు. మీడియా సెంటర్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ 400 మంది పరకామణి సేవకులు, వంద మంది గ్రూపు సూపర్‌వైజర్లతోపాటు 3,500 మంది శ్రీవారి సేవకులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారన్నారు. గరుడ సేవ రోజున మాడవీధుల్లో 2 వేల మంది ప్రత్యేకంగా నియమించామన్నారు. వీరిలో అన్నప్రసాదం కోసం 800 మంది, ఆరోగ్య శాఖకు 700 మంది, హోల్డింగ్ పాయింట్‌కు రెండొందలు, విజిలెన్స్ పోలీసులకు మూడొందలు వంతున కేటాయించినట్లు చెప్పారు. టీటీడీ పీఆర్వో నీలిమ పాల్గొన్నారు.

23,48,337 మందికి అన్నప్రసాదాలు

తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : బ్రహ్మోత్సవాల్లో ఆరు రోజులపాటు 23,48,337 మందికి అన్నప్రసాదాలు, 11,32,160 మందికి పానీయాలను పంపిణీ చేసినట్లు డిప్యూటీ ఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. రాంభగీచ-2లోని మీడియా సెంటర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నాణ్యతకు ప్రాధాన్యత నిస్తూ అల్పాహారం, పాలు, మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు. అన్నప్రసాద ప్రత్యేక అధికారి జీఎల్ఎన్ శాస్త్రీ మాట్లాడుతూ గరుడ వాహన సేవ రోజున నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలతోపాటు హోల్డింగ్ పాయింట్ల వద్ద 9,28,000ల మందికి అన్నప్రసాదాలు, 6,27,200ల మందికి పానీయాలను అందజేశామన్నారు. 1300 మంది సిబ్బంది అన్నప్రసాదాల పంపిణీలో తమ సేవలు అందించారన్నారు. టీటీడీ సీపీఆర్వో టి.రవి పాల్గొన్నారు.

పారిశుధ్యానికి పెద్దపీట

తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : బ్రహ్మోత్సవాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేసినట్లు టీటీడీ ఆరోగ్య విభాగం డిప్యూటీ ఈవో సోమన్నారాయణ తెలిపారు. మీడియా సెంటర్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ,స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను విజయవంతంగా అమలు చేశామన్నారు. గరుడ వాహన సేవ రోజున 650 మంది అదనపు సిబ్బందితో మాడవీధులు, గ్యాలరీల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ చేపట్టినట్లు తెలిపారు. టీటీడీ హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ పాల్గొన్నారు.

వేదపండితులకు వస్త్రాలు

తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : శ్రీవారి ఆలయంలోని వేదపండితులకు ఎన్టీఆర్ కృష్ణాజిల్లాకు చెందిన పారిశ్రామిక వేత్త కేవీ.నరసయ్య స్థానిక అర్చక భవనంలో మంగళవారం నూతన వస్త్రాలను బహూకరించారు. తిరుచానూరు, శ్రీకాళహస్తి ఆలయాల్లోని వేదపండితులకు కూడా నూతన వస్త్రాలను అందిస్తున్నట్లు నరసయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐజీ జె.ప్రభాకర్, ఎస్పీ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



పండితులకు వస్త్రాలు ప్రభాకర్ చేతులు మీదుగా అందజేస్తున్న దాత నరసయ్య



చంద్రప్రభ వాహనసేవలో గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి

గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ మంగళవారం చంద్రప్రభ వాహనసేవలో పాల్గొన్నారు. వాహనసేవ ప్రారంభంలో ఆయన ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు.





తిరుమల బ్రహ్మోత్సవాల్లో కళాబృందాలు శ్రీనివాసుడికి కళార్చన చేస్తూ భక్తుల హృదయుల్లో ఆధ్యాత్మిక భావనలు నింపుతున్నాయి. మంగళవారం రాత్రి జరిగిన చంద్రవాహనసేవలో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



రాజరాజేశ్వరిదేవిగా మూలస్థాన ఎల్లమ్మ



రాజరాజేశ్వరి దేవిగా మిట్టమీద గంగమ్మ




మహాగౌరీదేవిగా ఉగ్రప్రత్యంగిరాదేవి



రాజశ్యామలాదేవిగా మరకతకాళీ అమ్మ



సూరావారిపల్లెలో దుర్గాదేవి అలంకారం



దుర్గగా నేంద్రగుంట మూలస్థానమ్మ

జగన్మాతా..నమోస్తుతే..



దుర్గాదేవిగా మూలస్థాన ఎల్లమ్మ



మహిషాసురమర్దినిగా చాముండేశ్వరీ



దుర్గా దేవి అలంకరణలో గంగమ్మ

చంద్రగిరి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూలస్థాన ఎల్లమ్మ మంగళవారం రాత్రి ఎల్లమ్మ రాజరాజేశ్వరిదేవి అలంకరణలో సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మిట్టమీద గంగమ్మ ఉత్సవమూర్తిని రాజరాజేశ్వరిగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం ఆవరణలోని సంతోషిమాతకు చండీదేవి సహస్రనామార్చన,చేశారు. తొండవాడలోని ఉగ్రప్రత్యంగిరాదేవి మహాగౌరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. **రామచంద్రాపురం**: శక్తిపీఠంలో మరకత శక్తి కాళీ అమ్మవారు రాజశ్యామలాదేవిగా దర్శనమిచ్చారు. సూరావారి పల్లె ఏకవీర ఫౌండేషన్ వద్ద దుర్గాదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. రాయలచెరువుకట్ట భవాని జలకంఠేశ్వరాలయంలో మహాలక్ష్మి, భవాని, కామాక్షి అమ్మవార్లు దుర్గాదేవిగా కటాక్షించారు. **పాకాల**: నేంద్రగుంట మూలస్థానమ్మ దుర్గాదేవి అలంకారంలో దర్శన మిచ్చారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. **తిరుపతి రూరల్**: తుమ్మలగుంట ఎల్ఎస్‌నగర్‌లోని శక్తిచాముండేశ్వరీదేవి మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. చెంచువారికాలనీలో మూలస్థాన ఎల్లమ్మ దుర్గాదేవి అలంకారంలో అభయమిచ్చారు. **భాకరాపేట**: చిన్నగొట్టిగల్లు చెరువుకట్టపై గంగమ్మ దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

మార్కెట్లోకి అల్ట్రా వయోలెట్ ఎలక్ట్రిక్ బైక్


బైక్‌ను విడుదల చేస్తున్న సంస్థ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించబడిన అల్ట్రావయోలెట్ ఎలక్ట్రిక్ బైక్ మంగళవారం మార్కెట్లోకి విడుదలైంది. రేణిగుంట ప్రధాన రహదారిలో నూతనంగా ఏర్పాటుచేసిన యూవీ స్పేస్ స్టేషన్ షోరూంతోపాటు ఈ కొత్త బైక్‌ను సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గజానన్‌ఉమరేకర్, డెలివర్ ప్రిన్సిపల్ సుధాకర్‌నాగలపాటి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ వాహనాన్ని రూపొందించినట్లు తెలిపారు. దీని విలువ రూ.2.49లక్షలని తెలిపారు. కెమెరా, రాడార్ అనుసంధానంతో నడిచే మొదటి వాహనమని వెల్లడించారు. సోలార్ సిస్టమ్ అమర్చి ఉండటంతో బ్యాటరీ ఆటోమెటిక్‌గా రీచార్జ్ అవుతుందన్నారు. ఒకసారి రీచార్జ్ చేసుకుంటే 323 కిలోమీటర్ల దూరం నడపవచ్చన్నారు. రూ.999 చెల్లించి వెబ్‌సైట్ లేక షోరూంలో నమోదు చేసుకుంటే ఈ నెల 22 నుంచి డెలివరీ చేస్తామన్నారు. హైదరాబాదులో 2, విశాఖ, తిరుపతిలో మాత్రమే షోరూంలు ఉన్నాయని తెలిపారు.

క్రీడా అకాడమీల పరిశీలన


నిరుపయోగ భవనాలను పరిశీలిస్తున్న రమణ

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శాప్ ట్రైబల్ స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్వీ రమణ, శాప్ బోర్డు మెంబర్ ఈ.రజనీ మంగళవారం తిరుపతిలోని క్రీడా అకాడమీ భవనాలను పరిశీలించారు. ఎస్వీయూలో నిరుపయోగంగా ఉన్న మూడు భవనాలను, ఆర్ట్స్ కాలేజీలో ఖాళీగా ఉన్న హాకీ ప్రాంగణాన్ని పరిశీలించి వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ఆగిపోయిన క్రీడా అకాడమీలను పునఃప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోందని, అందులో భాగంగానే వాటిని పరిశీలించామని చెప్పారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. శ్రీనివాస క్రీడా సముదాయం సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో శశిధర్, శాప్ కోచ్‌లు ప్రేమ్‌నాథ్, చక్రవర్తి పాల్గొన్నారు.

అంకుర ఆస్పత్రి ఎంఎస్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ వంశీ

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అంకురా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ ఆసియా టుడే మీడియా ప్రైవేట్ లిమిటెడ్, న్యూఢిల్లీ వారి నుంచి హెల్త్‌కేర్ పర్సనాలిటీ ఆఫ్ ద ఇయర్-పీడియాట్రిక్స్ ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ఇటీవల లండన్ పార్లమెంట్ ఆవరణలో జరిగిన గ్లోబల్ లీడర్స్ సమ్మిట్ 2025 ఉత్సవాల్లో ఈ అవార్డు అందుకున్నారు. చిన్నపిల్లల ఆరోగ్య పరిరక్షణ విభాగంలో ఆయన చేసిన సేవలకు గాను ఈ అవార్డు దక్కింది. ఆస్పత్రి యాజమాన్యంతోపాటు పలువురు వైద్యులు వంశీకృష్ణను అభినందించారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి


తిరుపతి రైల్వేస్టేషన్‌లో నిర్మాణాలను పరిశీలిస్తున్న సీఈ సూర్యనారాయణ

తిరుపతి (ఆటోనగర్), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని దక్షిణ మధ్య రైల్వే నిర్మాణాల విభాగం చీఫ్ ఇంజనీర్ సూర్యనారాయణ ఆదేశించారు. మంగళవారం ఆయన స్టేషన్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రాధాన్యత మేరకు పనులు పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. దక్షిణం వైపు భవనం డిసెంబరు లోపు పూర్తి చేసి అప్పగించాలన్నారు. డిప్యూటీ సీఈ వామనమూర్తి, ఏడీఇఎన్ దరూరు ప్రభాకర్, ఎస్ఎస్ఈ మాధవరావు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా తాతయ్యగుంట గంగమ్మ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక తాతయ్యగుంట గంగమ్మ మంగళవారం దుర్గాదేవిగా భక్తులకు అభయమిచ్చారు. ఉదయం మూలవిరాట్టుకు సర్వాభిషేకాలు నిర్వహించారు. దుర్గాదేవి అలంకారం చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు దర్శనం కల్పించి, కుంకుమార్చన నిర్వహించారు.


తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో దుర్గాదేవి అలంకరణలో మూలవిరాట్టు, ఉత్సవమూర్తి


హోమపూజల్లో పూజా ద్రవ్యాలను సమర్పిస్తున్న పాలకమండలి సభ్యులు, ఈవో


దుర్గాదేవి అలంకారంలో పల్లెవీధి వేశాలమ్మ, నడివీధి గంగమ్మ


మహిషాసురమర్దిని అలంకరణలో లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణాదేవి, కొత్తవీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి


దుర్గాదేవి అలంకరణలో కరకంబాడి రోడ్డులోని బొంతాలమ్మ

సాయంత్రం ఊంజల్ సేవలో అమ్మవారి ఉత్సవమూర్తికి దుర్గాదేవి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అంతకు ముందు జరిగిన హోమ పూజల్లో ఆలయ పాలకమండలి చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, సభ్యులు, ఈవో జయకుమార్ పాల్గొని పూజా ద్రవ్యాలను హోమగుండంలో సమర్పించారు. అలాగే పల్లివీధిలోని వేశాలమ్మ, ఆర్టీసీ బస్టాండు సమీపంలోని తాళ్లపాక పెద్దగంగమ్మ, పాత మున్సిపల్ ఆఫీసు అనుకుని ఉండే నడివీధి గంగమ్మ దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఊంజల్ సేవ వేడుకగా నిర్వహించారు. కపిలేశ్వరస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారు మహిషాసురమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఊంజల్ సేవ వైభవంగా జరిగింది. ఆయా ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

మహిషాసురమర్దినిగా అన్నపూర్ణాదేవి

తిరుపతి అర్బన్ (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణాదేవి ఆలయంలో మంగళవారం రాత్రి అమ్మవారు మహిషాసురమర్ధిని అలంకరణలో దర్శనమిచ్చారు. కొత్తవీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలోని మూలమూర్తి శాకాంబరిగా, ఉత్సవమూర్తి మహిషాసురమర్ధినిగా భక్తులను కటాక్షించారు.

దుర్గాదేవిగా బొంతాలమ్మ

తిరుపతి(జీవకోన) (ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాదేవి రూపంలో అలంకరణలో బొంతాలమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

నవరసభరితం తోలుబొమ్మల కళా ప్రదర్శన



తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక రామచంద్ర పుష్కరిణిలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి తోలుబొమ్మల కళా ప్రదర్శన నవరసభరితంగా సాగింది. కాకినాడకు చెందిన శ్రీనటరాజ నిలయ చర్మచిత్ర కళా ప్రదర్శన కమిటీ బృందం సభ్యులు పవన్‌కుమార్, గణపతి, రాణి, మల్లిబాబు, సూరిబాబు, హర్షవర్ధన్, జ్యోతిబాబు ఈ తోలు బొమ్మలను ప్రదర్శించారు. రామాయణంలోని సుందరకాండ ఘట్టం, మహాభారతంలోని నర్తనశాల పర్వాన్ని ప్రదర్శించి అబ్బురపరిచారు. తెరవెనుక ఆడుతున్న బొమ్మలకు అనుగుణంగా ఆ సారాంశాన్ని వినిపించారు. కార్యక్రమం అనంతరం ప్రోగ్రాం సహాయ అధికారి పద్మ తిరుమలేశుడి తీర్థప్రసాదాలను కళాకారులకు అందించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు : వైసీపీ


నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, రాజేంద్ర తదితరులు

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం వైసీపీ ఎస్సీ విభాగం నేత తలారి రాజేంద్ర ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మురళి, వాసుదేవ యాదవ్, అమరనాథ్‌రెడ్డి, సాకం ప్రభాకర్, లడ్డీ వెంకటేష్, దేవదానం, బొగ్గుల వెంకటేష్, మద్దాలిశేఖర్, దినేష్ రాయల్ తదితరుల పాల్గొన్నారు.

ఖాదీ సంతను విజయవంతం చేద్దాం

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌రాజు


పోస్టర్లు, ప్రచార రథాలతో బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్, అశోక్‌రాజు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో తిరుపతిలో నిర్వహించనున్న ఖాదీ సంతను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆత్మ నిర్భర్ భారత్ కమిటీ జోనల్ ఇన్‌చార్జి అశోక్‌రాజు కోరారు. మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి, మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక త్యాగరాజ మండపంలో నిర్వహించనున్న ఖాదీ సంతకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి, ప్రచార రథాలను ప్రారంభించారు. చేనేత, ఖాదీ, హస్తకళలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చేనేతకారులు, హస్తకళాకారులు, సేంద్రియ ఉత్పత్తులు, ఖద్దరు, నూలు వస్త్రాలను ప్రోత్సహించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ కోరారు. అనంతరం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, జిల్లా ఉపాధ్యక్షులు వేదవతి, ప్రశాంతిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ బాబు, కార్యదర్శి హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెరీగుడ్..బాగా పనిచేశారు

● ఆర్టీసీ సిబ్బందికి ఈడీ అభినందనలు


సీనియర్ మెకానిక్‌ను సన్మానిస్తున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ సేవ రోజు ఎలాంటి ఇబ్బందీ లేకుండా భక్తులకు సురక్షిత ప్రయాణం కల్పించారు.. వెరీగుడ్' అంటూ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి అధికారులను, సిబ్బందిని అభినందించారు. మంగళవారం సెంట్రల్ బస్టాండులోని తిరుపతి డిపో గ్యారేజీలో అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీవారి గరుడసేవ రోజున 2.16లక్షల మంది భక్తులకు తిరుమల ఘాట్‌లో రవాణా కల్పించి ఆర్టీసీ చరిత్రలోనే రికార్డు సృష్టించామన్నారు. సుస్థిరమైన ప్రణాళిక వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఘాట్ బస్సుల ఫిట్‌నెస్‌లో నాణ్యత చూపించిన మెకానిక్స్‌ను అభినందించారు. స్త్రీశక్తి పథకం కూడా ఎలాంటి ఫిర్యాదులూ లేకుండా విజయవంతంగా అమలవుతోందని తెలిపారు. రాబోవు రోజుల్లోనూ రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని ఆకాంక్షించారు. త్వరలోనే నూతన బస్సులు అందుబాటులోకి రానున్నాయని, ఇతర సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టామని అన్నారు. పారిశుధ్య కార్మికుల జీతాల పెంపు విషయాన్ని యాజమాన్యం పరిశీలిస్తోందన్నారు. అనంతరం సీనియర్ మెకానిక్ పి.భాస్కర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజారవాణాధికారి జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, సీఎంఈ బాలాజీ, డిపో మేనేజర్ సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

పట్నూలు వీధిలో అగ్ని ప్రమాదం

● రూ.10 లక్షల నష్టం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్నూలు వీధిలో మంగళవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి వివరాల మేరకు.. పట్నూలు వీధిలో కాపురముంటున్న కె.మాధవి ఇంట్లోనే పేపర్ ప్లేట్ల తయారీ పరిశ్రమ నడుపుతున్నారు. మధ్యాహ్నం 11.30 గంటల సమయంలో పేపర్ ప్లేట్లు తయారు చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి వచ్చే లోగా మిషనరీతో పాటు ముడి పదార్థాలు, తయారు చేసి సిద్ధంగా ఉంచిన పేపర్ ప్లేట్లు, ఇతర వస్తువులు, ఫర్నిచర్ కాలిపోయాయి. దాదాపు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపారు. వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మహనీయుల విగ్రహాలను కాపాడుకోవాలి


మొల్ల విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న జల్లి మధుసూదన్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహనీయుల విగ్రహాలను కాపాడుకోవడం అందరి బాధ్యతని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ అభియాన్‌లో భాగంగా రామాయణ రచయిత వాల్మీకి, రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన రచయిత్రి మొల్ల విగ్రహాలను బీజేపీ నాయకులు మంగళవారం శుభ్రపరిచారు. పరిసరాలను శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ విగ్రహాలను శుభ్రపరచడమే కాకుండా వాల్మీకి, మొల్లను ఆదర్శంగా తీసుకుని వారి ఆలోచనలను అనుసరించాలని కోరారు. రూపేష్‌బాబు, జయంత్‌కుమార్, రాజ్‌కుమార్, నాగేంద్ర, శుభకర్, నాగరాజరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ జనశక్తి విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తోకల అశోక్ కుమార్ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎస్.పవన్‌కుమార్, ఐ.వెంకటాద్రి, శ్రీరాం, మల్లికార్జున, సోమశేఖర్, రామానాయుడు పాల్గొన్నారు.





రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

తిరుపతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. ఎస్సీ, ఉద్యోగ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతిలోని పూలేవిగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ దళిత కుటుంబంలో పుట్టినా ప్రపంచంలో ఆయనకు మించిన మేధావి లేరన్నారు. దేశంలోని 140 కోట్ల మంది కులాలు, మతాలు, భాషలకతీతంగా ఉన్నారంటే అందుకు అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే కారణమన్నారు. 40 ఏళ్లుగా దేశ రాజకీయాలను శాసిస్తున్నది దళితులేనని, ఇప్పుడు ఆ దళిత కులాలను విభజిస్తే దేశం కూడా రెండు ముక్కలవుతుందని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం దళితుల జోలికొస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పలువురు దళిత సంఘ నేతలు ప్రసంగించారు. పాదయాత్రలో కళాకారుల ఆటపాటలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎస్సీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్, శ్రీనివాసరావు, పరమశివన్, మురళి, గోపి తదితరులు పాల్గొన్నారు.

కళా నీరాజనం









● 28 రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాకారులు

● ఆధ్యాత్మికానందాన్ని పంచుతున్న ప్రదర్శనలు

కథాకళి.. 'గోవింద'రాజు

కనులు, కనుబొమ్మలు తిప్పుతూ, గాల్లో ఎగురుతూ, చక్కటి హావ భావాలతో 'కథాకళి' ప్రదర్శన ఇచ్చిన ఇతడి పేరు గోవిందరాజు. కేరళ రాష్ట్రం. బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం. ఐపీఎస్ కావాలన్నది లక్ష్యం. దీనికోసం సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నారు. దీనికోసం



చిన్నప్పటి నుంచి ఎంతో మక్కువతో నేర్చుకున్న నృత్యానికీ కొంత దూరమయ్యారు. కానీ, శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శనకు అవకాశం రాగానే, అన్నిటినీ పక్కన పెట్టి తిరుమలకు చేరుకున్నారు. మంగళవారం రాత్రి చంద్రప్రభ వాహనం ముందు 'కథాకళి' ప్రదర్శనతో భక్తుల మనసు దోచుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమల గిరులు ఆటపాటలతో హోరెత్తిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం వాహనసేవల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళా బృందాల ప్రదర్శనలు భక్తులను తన్మయులను చేస్తున్నాయి. శాస్త్రీయ నృత్యాలు, జానపదాలు, పౌరాణిక వేషధారణలు.. ఎటు చూసినా అందమే! రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక, కేరళ, తమిళనాడు, మధ్యప్రదేశ్, జమ్మూకాశ్మీర్, గుజరాత్, మహారాష్ట్ర, ఒరిస్సా, ఛతీస్‌ఘడ్, పంజాబ్, మణిపూర్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ ఇలా మొత్తం 28 రాష్ట్రాల నుంచి 6,960 మంది కళాకారులుఆడిపాడి అలరించారు. మంగళవారం పగలు సూర్యప్రభ వాహనం ముందు, రాత్రి చంద్రప్రభ వాహన సేవలో తొమ్మిది రాష్ట్రాలకు సంబంధించిన 21 బృందాల్లోని 491 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తాదుల మనస్సును దోచుకున్నారు.టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, ఎస్వీ సంగీత నృత్య కళాశాల, దాససాహిత్య ప్రాజెక్ట్, అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

- తిరుమల(కల్చరల్), ఆంధ్రజ్యోతి

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు.

కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

సవాళ్లకు సిద్ధమే

సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.



ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.




గూడూరు: దుర్గాదేవి అలంకారంలో విజయదుర్గాదేవి


చిల్లకూరు: దుర్గాదేవి అలంకారంలో ముత్యాలమ్మ


వెంకటగిరి టౌన్: మహిషాసురమర్దిని అలంకారంలో కన్యకాపరమేశ్వరి


కోట: దుర్గాదేవి అలంకారంలో గ్రామదేవత కోటమ్మ


గూడూరు: పార్వతిదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి


వెంకటగిరి టౌన్: విష్ణుదుర్గాదేవి అలంకారంలో కాత్యాయనీ దేవి



దుర్గాదేవి అలంకారంలో సూళ్లూరుపేట చెంగాళమ్మ - అమ్మవారికి సారెను తీసుకెళ్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులు


నాయుడుపేట: దుర్గాదేవి అలంకరణలో మూకాంబికాదేవి


పెళ్లకూరు: మహిషాసుర మర్దినిగా చండికాపరమేశ్వరి


గూడూరు: ఆదిపరాశక్తి అలంకరణలో బజారుకలశం దుర్గాదేవి


కోట: దుర్గాదేవి అలంకారంలో వాసవీ కన్యకా పరమేశ్వరి


వెంకటగిరి టౌన్: కంచికామాక్షీదేవి అలంకారంలో మందనాంచరేశ్వరి


డక్కిలి: దుర్గాదేవి అలంకరణలో పార్వతీదేవి

దుర్గమ్మా.. కరుణించు తల్లీ...

సూళ్లూరుపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకం జరిపి పుష్పాలతో అలంకరించారు. అనంతరం చండీయాగం నిర్వహించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి, నెలవల సుబ్రహ్మణ్యం, అమృత దంపతులు, పరమేశ్వరి నగర్, ఇందిరా నగర్, ఝాన్సీనగర్ గ్రామస్తులు అమ్మవారికి సారె సమర్పించారు. అలంకారానికి నెల్లూరుకు చెందిన గంగిశెట్టి సాయికుమార్, చండీయాగానికి సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, హారిక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

గూడూరు: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అలాగే బజారుకలశం వద్ద అమ్మవారిని ఆదిపరాశక్తిగా, రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని విజయదుర్గాదేవిగా, కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని పార్వతీదేవిగా, ధర్మరాజ స్వామి ఆలయంలో ద్రౌపదిదేవిని అన్నపూర్ణాదేవిగా, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మను దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. అర్థరథంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. అలాగే కలవకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిని రాజ్యలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరిదేవిని మహిషాసుర మర్దినిగా, మూలవిరాట్‌కు చందనం అలంకారం, మదనాంచరేశ్వరిని కంచి కామాక్షిదేవిగా, కర్ణకమ్మ వీధిలోని కాత్యాయనీ దేవిని విష్ణుదుర్గాదేవిగా, వెంకటేశ్వరస్వామికి నవనీత కృష్ణుడిగా అలంక రించి భక్తులకు దర్శనం కల్పించారు.

కోట: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరిని దుర్గాదేవిగా, గూడలిలోని రామలింగ చాముండేశ్వరిని దుర్గాదేవిగా, కోట గ్రామ దేవత కోటమ్మను దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మూకాంబికాదేవి, పోలేరమ్మ, మానసాదేవి, దుర్గమ్మ, కన్యకా పరమేశ్వరి, అంకమ్మ ఆలయాల్లో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా ఆలయాలలో అమ్మవార్లు వివిధ అలంకరణలో దర్శనమిచ్చారు. మూకాంబికాదేవిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెం గ్రామంలో ఉన్న చండికా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారిని మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలకరించి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

డక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి ఆలయంలో అమ్మవారు దర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

టీడీపీ నేతలకు ఎమ్మెల్యే విజయశ్రీ పరామర్శ

పెళ్లకూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పేరం రమేష్ నాయుడిని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు మంగళవారం పరామర్శించారు. ఇటీవల రమేష్ నాయుడు అనారోగ్యానికి గురై తిరుపతిలో చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. మ్మెల్యే విజయశ్రీ దంపతులు, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్యతో కలసి రమేష్ నాయుడు నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వీరి వెంట టీడీపీ నేలవల్లి సిద్దులయ్య నాయుడు ఉన్నారు.

నాయుడుపేట: టీడీపీ నాయకురాలు, మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ప్రభావతమ్మ ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నాయుడుపేట పట్టణంలోని ప్రభావతమ్మ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు రఫీ, భీమవరం సర్పంచ్ అమృత సరళ, మాజీ జడ్పీటీసీ శ్రీరాం ప్రసాద్, అవధానం సుధీర్, హైమావతి, సరళ, లక్ష్మి, గిరి, నెలవల ప్రసాద్, తదితరులు ఉన్నారు.

మూడు లారీల ఢీ: డ్రైవర్‌కు గాయాలు

తడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హఠాత్తుగా బ్రేక్ వేసిన లారీని మరో రెండు లారీలు వెనుక నుంచి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయలయ్యాయి. నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీకి బోడిలింగాలపాడు మలుపు వద్ద అకస్మాత్తుగా బైక్ అడ్డు రావడంతో డ్రైవర్ ఒక్కసారిగా బ్రైక్ వేశాడు. దీంతో వెనుక వస్తున్న మరో లారీ, దాని వెన కొస్తున్న మరో లారీ వరుసగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మూడు లారీలు కొంతమేర దెబ్బతిన్నాయి. ఓ లారీ క్లీనర్ సిద్ధిరాజు క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడగా, డ్రైవర్ కృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

పెళ్లకూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు డిజిటల్ బుక్ యాప్‌ను తీసుకొచ్చినట్లు ఎస్టీసీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం చిల్లకూ రులో డిజటల్ బుక్ యాప్ పోస్టర్ ఆవిష్కరించారు.

చిట్టమూరమ్మ ఆలయంలో పూజలు

చిట్టమూరు, సెప్టెంబర్ 30(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత చిట్టమూరమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్టమూరు మాజీ సర్పంచ్ అశోక్ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణ

బాలాయపల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది. సర్వే నంబరు 70లో ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నా రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యహహరిస్తున్నారు. అదే వ్యక్తి మరో రెండెకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించి మంగళవారం ఎక్స్‌వేటర్‌తో మొక్కలు తొలగిస్తుండగా గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వీఆర్వో మోహన్ వెళ్లి ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకుని ఎక్స్‌కవేటర్‌ను పంపించేశారు. ఇదే పంచాయతీలోని పాపిరెడ్డిపల్లి వడ్డిపాళెం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని వెంకటగిరి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి ప్లాట్లు వేసి లక్షల రూపాయలకు అమ్ము కుంటున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను రక్షించాలని కోరుతున్నారు.

పుత్తూరు వార్తలు

సరస్వతి దేవిగా ద్రౌపది అమ్మవారి కటాక్షం


కామాక్షి దేవిగా ద్రౌపది అమ్మవారు


సరస్వతి దేవిగా కామాక్షమ్మ


మహిషాసురమర్దినిగా వాసవీదేవి

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 30(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజస్వామి ఆలయంలో అమ్మవారిని కామాక్షిదేవిగా అలంకరించి పూజించారు. సదాశివేశ్వరస్వామి ఆలయంలో కామాక్షమ్మ... సరస్వతి దేవిగా భక్తులను కటాక్షించారు. రైల్వే క్వార్టర్స్ సమీపంలో కొలువై ఉన్న నాగాలమ్మను మధుర మీనాక్షిదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాచపాళెంలో ఉన్న లక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి గా భక్తులను కటాక్షించారు.

వడమాలపేట (ఆంధ్రజ్యోతి): దుర్గాష్టమిని పురస్కరించుకుని వాసవీదేవి మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం ఉదయం విఘ్నేశ్వర పూజ, అగ్నిహోమం అనంతరం అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. రాత్రి అమ్మవారిని మహిషాషుర మర్ధిని రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మార్కెట్ యార్డులో వారపుసంత

వడమాలపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రతి గురువారం వడమాలపేటలో నిర్వహిస్తున్న వారపు సంతను మౌలిక వసతులతో మార్కెట్ యార్డులో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్డు పక్కన అసౌకర్యంగా నిర్వహిస్తున్న వారపు సంతపై ప్రజల వినతుల మేరకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ స్పందించారు. పూర్తి స్థాయి వసతులతో మార్కెట్ యార్డులో సంత నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో పుత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ డి.ఎస్. గణేష్ స్థానిక టీడీపీ నాయకులతో కలసి మంగళవారం యార్డును పరిశీలించారు. ఈనెల 2న గురువారం నుంచి యార్డులో సంత నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ధనంజయులు నాయుడు, షణ్ముగరెడ్డి, దాముయాదవ్, శివరాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీడీకేఎస్ జిల్లా కమిటీ ఎంపిక



సంక్రాంతి వెంకటయ్య, రఘు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం జిల్లా కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని మహేష్ సదన్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనందబాబు అధ్యక్షతన జిల్లా కమిటీ ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా డి.రఘు, కార్యదర్శిగా సంక్రాంతి వెంకటయ్య, గౌరవాధ్యక్షుడిగా అంగేరి పుల్లయ్య, ఉపాధ్యక్షులుగా పెంచలయ్య, గురవయ్య, సహాయ కార్యదర్శులుగా అరుణాచలం, అక్బర్‌బాషా, కోశాధికారిగా రెడ్డిపల్లి సురేష్ నియమితులయ్యారు. కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గాజులపెళ్లూరు గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారాన్ని పురస్కరించుకుని పాలాభిషేకం చేసి పూలతో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గ్రామస్తులు ఎదురు పొంగళ్ళు పెట్టి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పట్నూలు వీధిలో అగ్ని ప్రమాదం: రూ.10 లక్షల నష్టం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్నూలు వీధిలో మంగళవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి వివరాల మేరకు.. పట్నూలు వీధిలో కాపురముంటున్న కె.మాధవి ఇంట్లోనే పేపర్ ప్లేట్ల తయారీ పరిశ్రమ నడుపుతున్నారు. మధ్యాహ్నం 11.30 గంటల సమయంలో పేపర్ ప్లేట్లు తయారు చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి వచ్చేలోగా మిషనరీతో పాటు ముడి పదార్థాలు, తయారు చేసి సిద్ధంగా ఉంచిన పేపర్ ప్లేట్లు, ఇతర వస్తువులు, ఫర్నిచర్ కాలిపోయాయి. దాదాపు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపారు. వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఖాదీ సంతను విజయవంతం చేద్దాం: అశోక్‌రాజు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో తిరుపతిలో నిర్వహించనున్న ఖాదీ సంతను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆత్మ నిర్భర్ భారత్ కమిటీ జోనల్ ఇన్‌చార్జి అశోక్‌రాజు కోరారు. మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి, మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక త్యాగరాజ మండపంలో నిర్వహించనున్న ఖాదీ సంతకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి, ప్రచార రథాలను ప్రారంభించారు. చేనేత, ఖాదీ, హస్తకళలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చేనేతకారులు, హస్తకళాకారులు, సేంద్రియ ఉత్పత్తులు, ఖద్దరు, నూలు వస్త్రాలను ప్రోత్సహించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ కోరారు. అనంతరం నగరంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి


పోస్టర్లు, ప్రచార రథాలతో బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్, అశోక్‌రాజు

మధుసూదన్, జిల్లా ఉపాధ్యక్షులు వేదవతి, ప్రశాంతిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్‌బాబు, కార్యదర్శి హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థిపై హత్యాయత్నం కేసులో 11మంది అరెస్టు


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ సునీల్‌కుమార్

తిరుచానూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో 11మందిని అరెస్టు చేసినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాకు తెలిపిన వివరాలు ఇలా... తిరుచానూరు నేతాజీరోడ్డులో ఉంటున్న ఇంజినీరింగ్ రెండో సంవత్సర విద్యార్థి దినేష్‌కు కుహల్ అలియాస్ మురళీకృష్ణకు మధ్య ఓ అమ్మాయి ప్రేమ విషయంలో పలుసార్లు గొడవలు జరిగాయి. ఈక్రమంలో ఈ నెల 24న రాత్రి కుహల్, అతని స్నేహితులు కలిసి దినేష్‌ను కత్తులు, బీరు సీసాలతో పొడిచి పారిపోయారు. ఈ హత్యాయత్నం ఘటనలో నిందితులు కుహల్, దినసాగర్, అజిత్, సునీల్, మహేష్, తేజా సాయి. చాణుక్య, అనిల్, పూర్ణచంద్, వినయ్, విష్ణువర్ధన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ జగన్నాథ్‌రెడ్డి, పోలీసు సిబ్బందిని చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ అభినందించారు.

వెరీగుడ్..బాగా పనిచేశారు

ఆర్టీసీ సిబ్బందికి ఈడీ అభినందనలు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): 'బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ సేవ రోజు ఎలాంటి ఇబ్బందీ లేకుండా భక్తులకు సురక్షిత ప్రయాణం కల్పించారు.. వెరీగుడ్' అంటూ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి అధికారులను, సిబ్బందిని అభినందించారు. మంగళవారం సెంట్రల్ బస్టాండులోని తిరుపతి డిపో గ్యారేజీలో అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీవారి గరుడసేవ రోజున 2.16లక్షల మంది భక్తులకు తిరుమల ఘాట్‌లో రవాణా కల్పించి ఆర్టీసీ చరిత్రలోనే రికార్డు సృష్టించామన్నారు. సుస్థిరమైన ప్రణాళిక వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఘాట్ బస్సుల ఫిట్‌నెస్‌లో నాణ్యత చూపించిన మెకానిక్స్‌ను అభినందించారు. స్త్రీశక్తి పథకం కూడా ఎలాంటి ఫిర్యాదులూ లేకుండా విజయవంతంగా అమలవుతోందని తెలిపారు. రాబోవు రోజుల్లోనూ రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని ఆకాంక్షించారు. త్వరలోనే నూతన బస్సులు అందుబాటులోకి రానున్నాయని, ఇతర సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టామని అన్నారు. అనంతరం సీనియర్ మెకానిక్ పి.భాస్కర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజారవాణాధికారి జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, సీఎంఈ బాలాజీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

తిరుపతి (ఆటోనగర్), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని దక్షిణ మధ్య రైల్వే నిర్మాణాల విభాగం చీఫ్ ఇంజనీర్ సూర్యనారాయణ ఆదేశించారు. మంగళవారం ఆయన స్టేషన్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రాధాన్యత మేరకు పనులు పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. దక్షిణం వైపు భవనం డిసెంబరు లోపు పూర్తి చేసి అప్పగించాలన్నారు. డిప్యూటీ సీఈ వామనమూర్తి, ఏడీఈఎన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

తిరుపతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. ఎస్సీ, ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతిలోని పూలేవిగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ దళిత కుటుంబంలో పుట్టినా ప్రపంచంలో ఆయనకు మించిన మేధావి లేరన్నారు. దేశంలోని 140 కోట్ల మంది కులాలు, మతాలు, భాషలకతీతంగా ఉన్నారంటే అందుకు అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే కారణమన్నారు. 40 ఏళ్లుగా దేశ రాజకీయాలను శాసిస్తున్నది దళితులేనని, ఇప్పుడు ఆ దళిత కులాలను విభజిస్తే దేశం కూడా రెండు ముక్కలవుతుందని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం దళితుల జోలికొస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పలువురు దళిత సంఘ నేతలు ప్రసంగించారు. పాదయాత్రలో కళాకారుల ఆటపాటలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎస్సీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్, శ్రీనివాసరావు, పరమశివన్, మురళి, గోపి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలను కాపాడుకోవాలి


మొల్ల విగ్రహ పరిసరాలను శుభ్రం చేసి, జలాభిషేకం చేస్తున్న మధుసూదన్

తిరుపతి (ఉపాధ్యాయ నగర్), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహనీయుల విగ్రహాలను కాపాడుకోవడం అందరి బాధ్యతని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ అభియాన్‌లో భాగంగా రామాయణ రచయిత వాల్మీకి, రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన రచయిత్రి మొల్ల విగ్రహాలను బీజేపీ నాయకులు మంగళవారం శుభ్రపరిచారు. పరిసరాలను శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ విగ్రహాలను శుభ్రపరచడమే కాకుండా వాల్మీకి, మొల్లను ఆదర్శంగా తీసుకుని వారి ఆలోచనలను అనుసరించాలని కోరారు. రూపేష్‌బాబు, జయంత్‌కుమార్, రాజ్‌కుమార్, నాగేంద్ర, శుభకర్, నాగరాజరెడ్డి పాల్గొన్నారు.

క్రీడా అకాడమీల పరిశీలన

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శాప్ ట్రైబల్ స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్వీ రమణ, శాప్ బోర్డు మెంబర్ ఈ.రజనీ మంగళవారం తిరుపతిలోని క్రీడా అకాడమీ భవనాలను పరిశీలించారు. ఎస్వీయూలో నిరుపయోగంగా ఉన్న మూడు భవనాలను, ఆర్ట్స్ కాలేజీలో ఖాళీగా ఉన్న హాకీ ప్రాంగణాన్ని పరిశీలించి వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆగిపోయిన క్రీడా అకాడమీలను పునఃప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోందని, అందులో భాగంగానే వాటిని పరిశీలించామని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో శశిధర్, శాప్ కోచ్‌లు, ప్రేమ్‌నాథ్, చక్రవర్తి పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు : వైసీపీ

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండు ఎదురుగా మంగళవారం నిరసన తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

అసుర సంహారిణి... మహిషాసురమర్దిని

ముక్కంటి ఆలయంలో శాస్త్రోక్తంగా ఆయుధపూజ



స్వామి అమ్మవార్ల ఆభరణాలు, ఆయుధాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీ కాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ఆయుధ పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన ముక్కంటీశుడి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు అశ్వ యుజ శుద్ధ అష్టమి(దుర్గాష్టమి) సందర్భంగా మంగళవారం స్వామిఅమ్మవార్ల నిత్య కల్యా ణ మండపంలో వినాయకస్వామి, సుబ్రహ్మణ్య స్వామి, దక్షిణామూర్తి, శనీశ్వరస్వామి, స్వామి అమ్మవార్ల కవచాలకు, నిత్య దీపారాధన ని ర్వహించే దీపాలను మండపంలో ఉంచి పూజ లు నిర్వహించారు. ఆలయ అర్చకులు నైవేద్యం, హారతులు, మంత్రపుష్పం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు, వేదపండితులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ పరిశ్రమల్లో ఆయుధ పూజ వేడుకలు



హంటర్ డగ్లస్ పరిశ్రమలో ఆయుధ పూజ

సత్యవేడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని పలు పరిశ్రమలు ఆయుధ పూజ వేడుకలను ఉత్సాహంగా, సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నాయి. కంపెనీల ఉత్పత్తికి వినియో గించే పనిముట్లు, యంత్రాలు, వాహనాలను అలంకరించి పూజలు నిర్వహించారు. కార్మికుల భద్రత, శ్రేయస్సును ఆకాంక్షిస్తూ పూజలను నిర్వహిం చారు. ఆధ్యాత్మికత, సంస్కృతి, సం ప్రదాయాలు, ఐక్యతను చాటేలా శ్రీసిటీలో ఈ వేడుకలు జరిగాయి. కాగా మరికొన్ని పరిశ్ర మలు బుధవారం ఆయుధ పూజను నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నాయి.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని శ్రీ కాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో అంగన్ వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో శాంతి దుర్గ తెలిపారు. శ్రీకాళహస్తి కేఎస్‌తిప్ప, ప్రాజెక్టు వీధి (బీసీ-ఈ) సహా యకురాలు, తొట్టంబేడు మండలంలోని కొత్త కండ్రిగలో (బీసీ-డి) సహాయకురాలు, ఎస్ఎన్ కండ్రిగలో (ఓసీ) సహాయకురాలి పోస్టులకు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తులు సమర్పిం చాల్సి ఉంటుంది. టెన్త్ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణపత్రం, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను దరఖాస్తుతో జతచేయాలి.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఏర్పేడు మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. రాజులపాళెం(ఎస్సీ) అంగన్‌వాడీ కార్యకర్త, ము నగలపాళెం(ఎస్సీ) సహాయకురాలు, పోతు మానుగుంట (ఎస్టీ) సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పిచ్చాటూరు(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో పి.సౌభాగ్యమ్మ తెలిపారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలో ఖాళీ గా ఉన్న వర్కర్, హెల్పర్ పోస్టులకు దరఖా స్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో దేవకుమారి తెలిపారు. వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ (జనరల్) కార్యకర్త, తొండంబట్టు (జనరల్) సహాయకురాలు, వరదయ్యపాళెం దళితవాడ(ఎస్సీ) సహాయకురాలు, పాండూరు (జనరల్), సత్యవేడు మండలం పాలగుంట (జనరల్) సహాయకురాలి పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కమ్యూనిస్టులతోనే ప్రజా చైతన్యం

● సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

వరదయ్యపాళెం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్యంలో కీలక పాత్ర కమ్యూనిస్టులదేనని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్ఆర్ కల్యాణమండపంలో సీపీఐ మండల కార్యదర్శి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మురళి మాట్లాడుతూ... దేశంలో ఆకలి, అణచివేత, దోపిడీ ఉన్నంత వరకు కమ్యూనిస్టు పార్టీ ఉంటుందన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతం సజీవమైనదని, ఆ విషయం వర్గ శత్రువులకు తెలుసన్నారు. దేశాన్నిఅభివృద్ధి చేయకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. అమెరికాలో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్న ట్రంప్ భారత్‌ను శాసించడం ఏమిటని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వానికి కొనసాగింపుగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు రాజకీయ శిక్షణ తరగతులు చేపడుతున్నట్లు తెలిపారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్, నాయకులు చంద్ర, రమేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థల ఆక్రమణకు యత్నం

● హెచ్చరిక బోర్డు ఏర్పాటు



వరదయ్యపాళెం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీకేఆర్‌పై కాలనీలో సర్వే నెం.84లో ఏపీఐఐసీకి చెందిన భూమిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించేందకు యత్నించారు. రాత్రికి రాత్రి భూమిని చదును చేసి నిర్మాణాలు చేపట్టేందుకు ఉపక్రమిం చారు. సమాచారం అందుకున్న తహసీ ల్దార్ సుధీర్ మంగళవారం ఆక్రమిత ప్రాంతాన్ని సందర్శించి రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డును నాటించారు. సదరు భూమిలో ఎవరు ప్రవేశించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్ఏ రామచంద్రయ్య, మస్తానయ్య, శ్రీహరి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ఆరె బంగారమ్మ



దుర్గాదేవిగా గుడిమల్లం ఆనందవల్లి



దుర్గాదేవిగా సర్వమంగళా దేవి



దుర్గాదేవిగా చెంగాళమ్మ



సరస్వతి దేవిగా అవనాక్షమ్మ



కాత్యాయనిగా కామాక్షిదేవి



మహిషాసురమర్దినిగా జ్ఞానప్రసూనాంబ



దుర్గాదేవిగా పొన్నాలమ్మ



భ్రమరాంబికగా బహదూరుపేట కరుమారియమ్మ



పటీశ్వరం దుర్గాదేవిగా బహదూరుపేట కన్యకాపరమేశ్వరి



వనదుర్గాదేవిగా దక్షిణ కాళికాదేవి



ఇంద్రాణిగా కన్యకాపరమేశ్వరి



మహాదుర్గాదేవిగా కనకదుర్గమ్మ



సిద్ధధాత్రిదేవిగా ఏడుగంగమ్మలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అసుర సంహారిణి మహిషాసురమర్దిని అంటూ భక్తులు అమ్మవార్లకు మొక్కారు. దసరా ఉత్సవాల్లో భాగంగా వివిధరూపాల్లో ఆయా ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబిక ఉత్సవమూర్తి అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. ఇదే ఆలయంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ మహా దుర్గాదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరిం చారు. శ్రీకాళహస్తి మండలం వేడాంలో ఉన్న దక్షిణ కాళికాదేవి ఆలయంలో అమ్మవారు వన దుర్గగా, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి మూ లమూర్తికి ప్రత్యేక అలంకారం, ఉత్సవ మూర్తిని ఇంద్రాణిగా అలంకరించారు. ముత్యాలమ్మ ప్రత్యేక అలంకారంలో, ఏడుగంగల అమ్మవారు సిద్ధధాత్రిగా దర్శనమిచ్చారు. పానగల్ గంగమ్మ, ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. భాస్కర పేట చాముండేశ్వరి, పొన్నాలమ్మ, బీపీ అగ్ర హారంలోని చిన్నగంగమ్మ, పెద్దగంగమ్మ, తెట్టు నల్లగంగమ్మలు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. బహదూరుపేట కరుమారియమ్మ భ్రమరాంబి కగా, కన్యకాపరమేశ్వరి పటీశ్వరం దుర్గాదేవిగా, విశ్వబ్రాహ్మణవీధిలోని గంగమ్మ, ముత్యాలమ్మ గుడి వీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మి, పూసల వీధిగంగమ్మ, శీతాలాంబ, త్రిశూలాంబ, సంత మైదానం అంకాళమ్మ, పీవీరోడ్డులోని అంకమ్మ అమ్మవార్లు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. చిందేపల్లిలో కొలువై ఉన్న పార్వతీదేవి, గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లిదేవి కూడా మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): దుర్గాష్టమి సం దర్భంగా మండలంలోని ఆరె గ్రామంలో కొలువై ఉన్న బంగారమ్మ ఆలయం, కళత్తూరులో కొలువై ఉన్న అంకాలమ్మ ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్స వాల్లో సర్వమంగళాదేవి దుర్గాష్టమి దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

జ్ఞాన సరస్వతిగా మరగదాంబిక

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): పల్లికొండేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు మంగళవారం మరగదాంబిక అమ్మ వారు జ్ఞాన సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయ వాహన మండపంలో మరగదాంబిక అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించారు. పట్టువస్త్రాలతో, బంగారు ఆభరణాలతో అలంకరించి ఊంజల్‌సేవ నిర్వహించారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయం గ్రామంలో కొలువై ఉన్న అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులను కటాక్షించారు. అలాగే కైలాసనాథ కోనలోని కామాక్షి అమ్మవారు కాత్యాయని అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



జ్ఞాన సరస్వతిగా మరగదాంబిక

117ట్రిప్పులతో ప్రయాణికులకు ఆర్టీసీ సేవలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో నుంచి శ్రీవారి బ్ర హ్మోత్సవాలకు సోమవారం శ్రీకాళహస్తి నుం చి తిరుపతికి పల్లెవెలుగు సర్వీసులను 117 ట్రిప్పులు తిప్పి స్త్రీశక్తి పథకం ద్వారా ఎక్కువ మంది ప్రయాణికులు, భక్తులను గమ్య స్థానాలకు చేరవేసినట్లు డిపో మేనేజరు రేవతి మంగళవారం తెలిపారు. ఆది, సోమ వారాల్లో తిరుపతి - తిరుమల మధ్య 158 ఎక్స్‌ట్రా ట్రిప్పులతో భక్తులను గమ్యస్థానాలకు చేరవేసినట్లు తెలిపారు. డిపో చరిత్రలో సోమవారం అత్యధికంగా రూ.32.30లక్షలు ఆదాయం వచ్చినట్టు తెలిపారు. ఉద్యోగుల సమష్టి కృషితో ఇది సాధ్యమైందన్నారు.

రిటైర్డ్ ఎస్ఐకు సాదర వీడ్కోలు

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన ఎస్ఐ విశ్వనాథనాయుడిని మంగళవారం సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌లో సాదరంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లా డుతూ.. 43 సంవత్సరాలుగా విధులు నిర్వ ర్తించారని, ఆయన అనుభవాలు తమకు ఎంతగానో ఉపయోగపడ్డాయని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ బాలగురవయ్య, ప్రభాకర్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించాలి

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోగా వినియోగదారులు విద్యుత్ బిల్లులను చెల్లించాలని ట్రాన్స్‌కో ఏఈ చలపతి తెలి పారు. ఆయన మంగళవారం బీఎన్‌కండ్రిగలో బిల్లులు చెల్లించని దుకాణాల వద్ద సిబ్బందితో కలిసి వసూలు చేశారు.

కనకాచలంపై సదుపాయాలు కల్పించాలి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళ హస్తీశ్వరాలయానికి అను బంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో అదనపు సౌక ర్యాలు కల్పించాలని హిందూ ధార్మిక మండలి కన్వీనర్ గరికపాటి రమేష్‌బాబు ఆల య అధికారులకు విజ్ఞప్తి చే శారు. కనకదుర్గమ్మ ఆల యానికి శరన్నవరాత్రుల్లో భక్తుల తాకిడి ఉంటుంద న్నారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపా లు పెట్టి మొక్కులు చెల్లిం చుకుంటారని తెలిపారు. అయితే భక్తుల తాకిడి ఎక్కు వగా ఉన్న నేపథ్యంలో దీపా లు పెట్టుకునే ప్రదేశం చాలక ఇబ్బందులు పడుతున్నా రన్నారు. దీంతో దీపం కొండె క్కక మునుపే వాటిని ఖాళీ చేసి వేరొకరికి అవకాశం కల్పి స్తుండటంతో చాలా మంది భక్తులు ఆవేదన చెందు తు న్నారన్నారు. అధికారులు ఈ సమస్యలపై దృష్టి సారించి సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు.